క్లుప్తంగా

వరద ప్రభావిత వార్డుల్లో పన్నుల వసూళ్లు వాయిదా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రస్తుతం విజయవాడలో నెలకొన్న వరద పరిస్థితుల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వ ఆదేశాల మేరకు వరద ప్రభావిత ప్రాంతాలలో ఆస్తి, ఇతర పన్నుల వసూళ్లను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యాన్‌చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో వరద ప్రభావిత ప్రాంతాలైన 32 వార్డులలో (1, 5,7,15,16,17,18,19, 20,21,22,30, 32, 40, 41,42,43,44, 45,46,47,54,55, 56,57,58, 59, 60,61,62,63,64) వచ్చే మూడు నెలల వరకు విజయవాడ నగరపాలక సంస్థ వారికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను, తదితర పన్నుల వసూళ్లను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించటం అలవాటుగా చేసుకోవాలని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన స్వచ్ఛతాహీ సేవలో భాగంగా మొక్కలు నాటి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు నవంబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతాహీ సేవ జరుగుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటటం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటి పరిసరాలు శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కె.రమేష్, వ్యాయామ అధ్యాపకుడు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో సత్తాచాటిన ఎస్ఆర్ఆర్ విద్యార్థులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): యోగాసన చాంపియన్ షిప్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించారు. విశాఖపట్నంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన 49వ ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్ షిప్ లో పి.షాలేమ్ రాజు ప్రథమ స్థానం సాధించగా పి.శృతి 5వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా బుధవారం పోటీల్లో సత్తాచాటిన ఇద్దరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అభినందించారు. కళాశాలలో క్రీడలకు పెద్ద పీట వేస్తున్నామని రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయమని చెప్పారు. వ్యాయామ విద్యా విభాగం ఇన్‌చార్జి డాక్టర్ డి. యుగంధర్, డి.నవీన్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ .బాల సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయం రూ.3,81,967

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్ పేటలోని చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం హుండీ ఆదాయం రూ.3,81,967 లభించింది. ఆలయ ప్రాంగణంలో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వై. సీతారామయ్య మాట్లాడుతూ 114 రోజుల వ్యవధికి హుండీ ఆదాయాన్ని లెక్కించామని చెప్పారు. హుండీలో వెండి, బంగారం ఇతర వస్తువులు రాలేదన్నారు. లెక్కింపు ప్రక్రియలో దేవదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీ అధికారి వి. అనురాధ, పోలీసు, రెవెన్యూ, హిందూ సేవాదళ్‌సభ్యులు, ఆలయ వంశపారం పర్య ధర్మకర్తలు పాల్గొన్నారు.

అన్ని విధాలా ఆదుకుంటాం



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపు బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు అన్నారు. 32వ డివిజన్ అయోధ్యనగర్‌లో బుధవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని డివిజన్ ఇన్‌ఛార్జి గుండే సుందర్‌పాల్, ఒగ్గు గవాస్కర్‌లతో కలిసి నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ వరద రాగానే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పేరం త్రివేణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీకి లేదు గ్యారెంటీ

తల్లికి వందనం ఈ ఏడాది లేనట్లేనని స్పష్టం చేసిన మంత్రి లోకేష్

సూపర్ సిక్స్ పేరుతో అడ్డగోలు హామీలు

ఎన్నికల వేళ ఊదరగొట్టిన కూటమి నేతలు

'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ' అంటూ చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టాడు. ఆ పార్టీ నేతలు ఇంటింటికీ తిరిగి 'సూపర్ సిక్స్' పథకాలు అమలు చేస్తామని హామీలు గుప్పించారు. కనిపించిన వారికల్లా నీకు రూ.15 వేలు .. నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు అంటూ చెవుల్లో మైకులు పెట్టి మరీ ప్రచారం చేశారు. అధికారంలోకి రాగానే ఒక్క పథకమూ అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులైనా పథకాల అమలు గురించి నోరెత్తడం లేదు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి... అమలు చేసే సమయానికి సూపర్ సిక్స్ పేరు వింటేనే భయమేస్తోందని చంద్రబాబు జంకుతున్నారు. ఉచితంగా గ్యాస్ సిలిండర్లు తుస్ మన్నాయి. నిరుద్యోగభృతి ఎన్నడో తెలియని పరిస్థితి. హామీల్లో ఒక్కొక్కటి అటకెక్కిస్తుంటే ప్రజలు నమ్మి మోసపోయామని వాపోతున్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉంటే క్యాలెండర్ ప్రకారం పథకాలన్నీ ఇంటికే వచ్చేవని ఆయన పాలనను గుర్తు చేసుకుంటున్నారు.

– గాంధీనగర్ (విజయవాడసెంట్రల్)

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్



ప్రతి మహిళకు నెలకు రూ.1,500

- నియోజకవర్గంలో పథకానికి అర్హులైన మహిళల సంఖ్య : **1,26,256**
- నెలకు ఇవ్వవలసింది మొత్తం రూ: **18,93,84,000**

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం
2019-20	73	9,85,500
2020-21	73	9,85,500
2021-22	69	9,31,500
2022-23	81	10,93,500
2023-24	80	4,40,000
మొత్తం		44,36,000



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

రైతులకు ఏటా రూ.20వేలు ఆర్థిక సహాయం.

- నియోజకవర్గంలో మొత్తం రైతులు: **81** మంది
- ఏడాదికి రైతులకు అందించాల్సిన మొత్తం: రూ. **16.20** లక్షలు

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం కోట్లు
2019-20	22,095	33.14
2020-21	27,170	40.75
2021-22	25,531	38.29
2022-23	24,604	36.90
మొత్తం		149.08



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

- ఏటా రూ.15,000
- నియోజవకర్గంలో మొత్తం విద్యార్థులు: **66,272**
- ఏడాదికి తల్లికి వందనం కింద రూ. **99,40,80,000**



యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి

ఇంటికో ఉద్యోగం లేని పక్షంలో నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి

- నియోజకవర్గంలో గృహాల సంఖ్య : **95,292**
- నిరుద్యోగులకు అందాల్సిన లబ్ధి మొత్తం రూ: **28,58,76,000**

ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నారు



తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు ఇవ్వాలి. అధికారం చేపట్టి వంద రోజులు అవుతంది. నగదు ఎప్పుడు ఇస్తారో చెప్పాలి. స్కూల్స్‌లో మాత్రం ఫీజుల కోసం తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. వెంటనే తల్లికి వందనం అమలు చేయాలి

– ఎం.సౌజన్య, సీతారాంపురం

ఇవ్వకపోతే తిరుగుబాటే



తాము అధికారంలోకి వస్తే 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఏటా రూ.18వేలు ఇస్తామని వాగ్దానం చేసిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ఇప్పటికీ స్పష్టమైన విధివిధానాలు ప్రకటించలేదు. ప్రతి మహిళకు హామీ మేరకు రూ.1500 ఇవ్వాల్సిందే. ఎప్పటి నుంచి ఇస్తారో, ఏ విధంగా నమోదు చేసుకోవాలో కూటమి ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి. మహిళలు ఎదురుచూస్తున్నారు. ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదు.

-కె.సరోజ, విజయవాడ

జాప్యం లేకుండా అమలుచేయాలి



టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. ఉద్యోగ ప్రయత్నాలకు నా చేతి ఖర్చుల నిమిత్తమై ఆ నగదు అక్కరకు వస్తాయి. ఈ పథకం నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరం. కానీ ఈ పథకంలో ఎటువంటి జాప్యం లేకుండా అమలుచేయాలని కోరుతున్నాం. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి అందించాలి.

-సీహెచ్ గణేష్, నిరుద్యోగి, గుణదల

నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలి



రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుద్యోగులకు ఇంటికో ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. లేని ఎడల నిరుద్యోగ భృతి నెలకు 3 వేల రూపాయలను చెల్లిస్తామని చెప్పిన మాట ప్రకారం భృతి చెల్లించాలి. నిరుద్యోగ భృతితో తల్లిదండ్రులపై భారం ఉండదు.

-షేక్ బాషా, వాంబే కాలనీ

పెట్టుబడి సాయం అందించాలి



అన్నదాత సుఖీభవ పథకం కింద ఎకరానికి 20 వేల రూపాయల ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ పంట సాగు చేసుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలి. రైతుల పెట్టుబడుల కోసం ప్రభుత్వం తక్షణమే అన్నదాత సుఖీభవ కింద సహాయం చేసి ఆదుకోవాలి.

-గర్నేపూడి కోటేశ్వరావు, 63వ డివిజన్

వరద బాధితులకు సరుకులు పంపిణీ



వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ 32వ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్



వరద బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ సభ్యులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదతో సర్వం కోల్పోయిన బాధితులకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ 32వ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్ అన్నారు. బసవతారకనగర్‌లో వరద ముంపు బాధితులకు బుధవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఒగ్గు గవాస్కర్, పేరం త్రివేణిరెడ్డి, శ్యామ్ బాబు తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. క్రీస్తు సంఘం ఆధ్వర్యాన బాధితులకు నిత్యావసర సరుకులు అందజేశారు. పాస్టర్ దేవరపల్లి అశోక్ కుమార్, పిల్లల స్వామి, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేములు హజరత్తయ్య గుప్త పిలుపు మేరకు వాసవి కపుల్స్ క్లబ్ మిర్యాలగూడ ఆధ్వర్యంలో బుధవారం వరద బాధిత కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు. వాంబేకాలనీ, రాజీవ్‌నగర్, రవీంద్ర థియేటర్ సెంటర్, రైల్వేట్రాక్ రోడ్డు వరద ప్రాంతాల్లోని బాధిత కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు. చీరలు, కండువాలు, లుంగీలు, ప్యాంట్లు, షర్టులతో పాటు, చిన్న పిల్లలకు డ్రస్సులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. మిట్టపల్లి విజయభాస్కర్, సామా శ్రీనివాసరావు, సోమా వెంకటేశ్వర్లు, రామచంద్రరావు, రత్నకుమారి, గవర్నర్ల గణేష్, సతీష్ పర్యవేక్షించారు. హజర్తయ్యగుప్తా బాధితులకు సహాయం చేసిన వారిని అభినందించారు.

దాతల సేవలు ప్రశంసనీయం

వరద ముంపు ప్రాంతాల్లోని బాధితులను ఆదుకోవడంలో దాతల సేవలు ప్రశంసనీయమని నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ జాతీయ అధ్యక్షుడు జాన్ మస్క్ తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని కండ్రిక, రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, వాంబేకాలనీ ప్రాంతాల్లోని వరద బాధితులకు నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల నవీన్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ డేవిడ్ శేఖర్ బాబు, నగర అధ్యక్షుడు పాస్టర్ సుందర్‌పాల్, డేనియల్ బాల తదితరులు పాల్గొన్నారు.

పట్టాన్(విజయవాడపశ్చిమ): వరదలతో ఇబ్బందులు పడ్డ బాధిత కుటుంబాలకు అందరూ అండగా ఉండాలని హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. కాకరపర్తి భావన్నారాయణ కళాశాల యూజీసీ ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్ క్లబ్ వరద ప్రభావిత గ్రామమైన అంబాపురంలో బాధిత కుటుంబాలకు బుధవారం బియ్యం, చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ, ఇన్నర్‌వీల్ క్లబ్ బాధ్యురాలు కరమ్‌కౌర్, క్రీడా విభాగాధిపతి డి.హేమచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపు వల్ల సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి కుటుంబం రెండు లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ నష్టపోయారని 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వదర బాధితులకు బుధవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. బాధితులకు ఆపన్న హస్తం అందించి తోడుగా ఉండాలని జగనన్న పిలుపు ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షంగా నిలబడుతుందని, వరద బాధితులంతా త్వరగా కోలుకొని సాధారణ స్థితికి రావాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు. వైఎస్సార్సీపీ నాయకులు ఎండీ అబ్దుల్లా, హఫీజుల్లా, నేరెళ్ల శివప్రసాద్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉపాధ్యాయ సమస్యలపై పోరాటంతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో యూటీఎఫ్ సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఉపాధ్యాయులు విరాళాలు సేకరించి బుడమేరు వరద బాధితులకు సాయం చేశారు. బుడమేరు వరద బాధితులకు యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. బుధవారం గవర్నర్‌పేటలోని యూటీఎఫ్ భవన్‌లో దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా బాధితులకు దుస్తులు పంపిణీ చేశారు. విరాళాలతో దుప్పట్లు, చీరలు, లుంగీలు, టవల్స్ వంటివి బాధిత కుటుంబాలకు అందజేశారు. బాధితుల్లో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు ఉన్నారు. రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఎస్పి మనోహర్ కుమార్ , జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు,జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సుందరయ్య, జిల్లా కోశాధికారి పి. నాగేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటి కన్వీనర్ కన్వీనర్ ఏ.గోపాలకృష్ణ, జిల్లా కార్యదర్శి డి.హరి ప్రసాద్, జిల్లా ఆడిట్ సభ్యుడు ఎం.లింగా రెడ్డి, రత్నకమల్ బాబు, చలపతి రావు, ఎం శ్రీనివాస రావు, సైదా సాహెబ్, సుప్రజ, గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో ఎస్టీలు జీవనోపాధి కోల్పోయారు

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు



వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ఎస్టీల కష్టాలు తెలుసుకుంటున్న శంకరరావు, శంకర్ నాయక్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా విజయవాడతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజల జీవితాలను అతలాకుతలం చేశాయని, ముఖ్యంగా ఎస్టీల జీవనోపాధిని బాగా దెబ్బతీశాయని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తెలిపారు. ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్‌తో కలిసి బుధవారం వరద ప్రభావిత ప్రాంతాలైన జక్కంపూడి వైఎస్సార్ కాలనీ, న్యూ రాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. వరదల వలన ఆదివాసీలు ఎదుర్కొన్న ఇబ్బందులు, ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు అందిన సహాయ, సహకారాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరద కారణంగా ఎస్టీలకు జరిగిన నష్టాలను మరింత లోతుగా తెలుసుకుని ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటించినట్లు చెప్పారు. ఎస్టీ కమిషన్ కార్యదర్శి కె.రామశేషు, ఏఓ ఎం.విజయ్‌కుమార్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ మానుపాటి నవీన్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత, యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రామచంద్రయ్య, ఎస్టీ సంక్షేమ సంఘం నేత ఉదయ్ కుమార్, విజయవాడ నార్త్ తహసీల్దార్ సీహెచ్ శిరీషా దేవి, రూరల్ తహసీల్దార్ బి. సుగుణ తదితరులు పాల్గొన్నారు.

అక్కినేని నటజీవితం ఆదర్శనీయం



అక్కినేని జాతీయ పురస్కారాలు అందుకుంటున్న డాక్టర్ కీర్తి చౌదరి, సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు

విజయవాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు నటజీవితం ఆదర్శప్రాయమని అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చీదెళ్ళ నాగేశ్వరరావు అన్నారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, తెలుగు కళావాహిని ధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికమీద బుధవారం అక్కినేని శత జయంతి ఉత్సవాలు, అక్కినేని జాతీయ పురస్కారాలు, సినీ సంగీత విభావరి నిర్వహించారు. శత జయంతి ఉత్సవాలను ప్రారంభించిన నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నటుడు అక్కినేని అని అభివర్ణించారు. అక్కినేని జాతీయ పురస్కార గ్రహీత డాక్టర్ కీర్తి చౌదరి మాట్లాడుతూ అక్కినేని లాంటి నటులు అరుదుగా జన్మిస్తారన్నారు. డాక్టర్ సీహెచ్ కీర్తి చౌదరి, సంగీత విద్వాంసుడు, సీహెచ్ బ్రహ్మానందరావుకు జాతీయ పురస్కారాలను ప్రదానం చేశారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, కె. డేవిడ్ రాజు, అక్కినేని జీవిత విశేషాలు వివరించారు. న్యాయవాది కోట జయరాజు, డాక్టర్ సతీష్ చౌదరి, కళాపోషకుడు మీరాకుమార్, బోడి ఆంజనేయ రాజు, పసుపులేటి వెంకటరమణ పాల్గొన్నారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు అక్కినేని చిత్ర గీతాలను ఆలపించారు.

తండ్రి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తండ్రి అదృశ్యమైన ఘటనపై కుమార్తె గుణదల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. రామవరప్పాడు హనుమాన్‌నగర్‌కు చెందిన పోలిశెట్టి సంధ్య తండ్రి వంగవీటి రామకృష్ణ 3వ తేదీ నుంచి కన్పించడంలేదు. చుట్టు పక్కల, తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేదు. దీంతో పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22న బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ బాల,బాలికల ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లను ఈ నెల 22వ తేదీన నూజివీడులోని ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్ క్రీడా ప్రాంగణంలో ఎంపిక చేస్తున్నట్లు కృష్ణాజిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి వి.వి.వి.ప్రసాద్ తెలిపారు. 2005 జనవరి రెండో తేదీ తరువాత పుట్టిన వారు ఈ పోటీలకు అర్హులన్నారు. ఈ పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న క్రీడాకారులు 22వ తేదీ ఉదయం ఎనిమిది గంటల లోపు ఎంపిక ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ ఐదు నుంచి ఏడో తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు ఆర్.వేణుగోపాల్(9490334333)ను సంప్రదించాలని సూచించారు.

ఐఎఫ్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్ టీయూ) జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఐఎఫ్‌టీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రథమ మహాసభ బుధవారం గాంధీనగర్ హనుమంతరావు గ్రంథాలయం (కుటుంబరావు, రామారావు హాల్) లో జిల్లా నాయకులు రవీంద్ర అధ్యక్షతన జరిగింది. మహాసభల్లో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా ఏవీ రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి.హరికృష్ణ రెడ్డి , ఉపాధ్యక్షుడిగా ఎస్కే మీరావలి, రవీంద్ర, వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా ఎస్కే బాజీ, కనకారావు, కొప్పుల కుమార్, జిల్లా కోశాధికారిగా టి.శ్రీనును ఎన్నుకున్నారు. వీరితోపాటు మరో 18 మందిని కార్యవర్గ సభ్యులుగా మహాసభ ఎన్నుకుంది. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పి. టాన్యా, ఎం.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌వి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం విద్యుత్ సబ్‌స్టేషన్ దాసాంజనేయ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరం బీఆర్‌టీఎస్ రోడ్డు, క్యాన్సర్ హాస్పిటల్ ఏరియా, ఏలూరు రోడ్డు, నార్లవారివీధి, కుటుంబరావు వీధి, బుల్లెమ్మ వీధి, కాటూరివారి వీధి, దానయ్య వీధి, పోతినేని వారి వీధి, అక్కుళ్ల తాతయ్య వీధి, దుగ్గిరాల బలరామ కృష్ణయ్య వీధి, మాచవరం రైవస్ కాలువ కట్ట ఏరియా, పడవలరేవు బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి మాచవరం దాసాంజనేయ స్వామి గుడి మధ్య ఉన్న ఏలూరు రోడ్ వైపు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గ్రంథాలయానికి కుర్చీలు వితరణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రిటైర్డ్ ఓఎన్‌జీసీ జీఎం తలారి వేణుగోపాల్ చిత్తరంజన్ గ్రంథాలయానికి రూ. 18 వేలు విలువ చేసే 20 కుర్చీలను వితరణ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయి ఉద్యోగం సాధించినట్లు తెలిపారు.

'చేరువ' ద్వారా విద్యార్థులకు అవగాహన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు చేరువ వాహనం ద్వారా విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, దొంగతనాల నివారణపై అవగాహన కల్పించారు. గవర్నర్ పేట పోలీసు స్టేషన్ పరిధిలోని లెనిన్ సెంటర్‌లో బుధవారం ఎస్ఐ దుర్గారావు నేతృత్వంలో చేరువ వాహనం ద్వారా వీడియో మెసేజ్‌లతో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

21న శ్రీ సిస్టర్స్ గాత్ర యుగళం

విజయవాడ కల్చరల్: సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో విఖ్యాత సంగీత విద్వాంసులు శ్రీ సిస్టర్స్ (శ్రీయా శ్రీనివాస్, శ్రీజ శ్రీనివాస్) లచే గాత్రయుగళం సంగీత కచేరి ఈ నెల 21 వ తేదీ శివరామ కృష్ణ క్షేత్రంలో ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు సీవీరావ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.